# విశాలాంధ్ర కృష్ణా జిల్లా

## పించన్లు పంపిణీ సిద్ధం

**విశాలాంధ్ర-కూచిపూడి :** వైయస్సార్ పెన్షన్ కానుకగా సెప్టెంబర్ ఒకటవ తారీఖు (శుక్రవారం) మొవ్వ మండలంలో 8,653 పెన్షన్లు పంపిణీకి సిద్ధం చేసినట్లు ఎండీవో జి. సుధాప్రవీణ్ గురువారం తెలిపారు. మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లు 145 మాత్రం ఆయా సచివాలయంలో ప్రత్యేకంగా కార్యక్రమం ఏర్పాటుచేసి కొత్త లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. మండలంలోని 16 సచివాలయాలకు మంజూరైన పెన్షన్లు వివరాలు ఇవే.... అవిరిపూడి సచివాలయానికి 382, అయ్యంకికీ496, భట్లపెనుమర్రు లో544, చినముత్తేవి 364, కోసూరుకు 934, కూచిపూడికు602, మంత్రిపాలెంలో 371, కాజ-1కు 661, కాజ-2కు 568, మొవ్వ-1 కు 479, మొవ్వ-2 కు 395, వేములమడకు 474, పెద ముత్తేవికి 609, పెదసనగల్లు కు 520, పెదపూడి కి 694, నిడుమోలు సజీవాలయానికి 560 వైఎస్ఆర్ పెన్షన్ కానుకలు ఆయా పంచాయతీల వాలంటీర్లు పంపిణీ చేయనున్నట్లు ఎండిఓ చెప్పారు. పెదపూడి సచివాలయంలో మంజూరైన 694 పెన్షన్ల నగదు వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు వలంటీర్లకు అందజేశారు.

### నేటి నుంచి పింఛన్లు

**విశాలాంధ్ర-పెదపారుపూడి :** మండలంలో నేటి నుంచి నూతన పింఛన్లు అందించడానికి ప్రభుత్వం వాలంటీర్ల ద్వారా సిద్ధమైనట్లు ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ భూషణగుళ్ళ సచివాలయ పరిధిలో 6, చిన్నపారుపూడి సచివాలయ పరిధిలో 6, యలమర్రు సచివాలయ పరిధిలో 13, మోపర్రు సచివాలయ పరిధిలో 7, దోసపాడు సచివాలయ పరిధిలో 16, పెదపారుపూడి సచివాలయ పరిధిలో 9, వానపాముల సచివాలయ పరిధిలో 10, వెంట్రప్రగడ సచివాలయం-1 పరిధిలో 6, వెంట్రప్రగడ సచివాలయం-2 పరిధిలో 11, మొత్తం 84 మందికి నూతనంగా వాలంటీర్లు పింఛన్లు ఇవ్వనున్నట్లు ఎంపీడీవో తెలిపారు. గతంలో 4472 తో కలుపుకొని మండల మొత్తంగా 4556 మందికి గాను రూ.1 కోటీ 23 లక్షల 93,500 లు ప్రతినెల పెదపారుపూడి మండలానికి ప్రభుత్వం అందించే పింఛన్ లను ఎంపీడీవో వివరించారు.

## అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**విశాలాంధ్ర-అవనిగడ్డ:** ఆగస్టు 26వ తేదీ శనివారం ఉదయం అవనిగడ్డ శివారు భారతి హాస్పిటల్ పక్కన విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు గృహాలు పూర్తిగా దగ్ధం కాగా రెండు కుటుంబాల వారు కట్టు బట్టలతో మిగిలారు. గురువారం కొడాలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొగిలేశ్వర గుప్తా ఒక్కొక్కరికి కట్ట బియ్యం నిత్యావసర సరుకులు, దుస్తులు నగదు అందజేశారు. అవనిగడ్డ సర్పంచ్ ఉమా వైసీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష మాజీ ఉప సర్పంచ్ గాజుల జై గోపాల్ పులిగడ్డ పంచాయతీ వార్డు సభ్యులు మధు సోషల్ ఆర్గనైజేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కూచిపూడి హైస్కూల్లో 'ప్రైమరీ కాంప్లెక్స్'

**విశాలాంధ్ర-కూచిపూడి :** మొవ్వ మండలంలోని ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలలోని 50 శాతం మంది ఉపాధ్యాయులకు గురువారం"ప్రైమరీ కాంప్లెక్స్"నిర్వహించారు. కూచిపూడి లోని శ్రీ సిద్దేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్గా ఉన్న ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెమ్మాని శేష సాయికుమార్ పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలిమెంటరీ పాఠశాలలో చిన్నారులకు ఇచ్చే శిక్షణ మారుతున్న కాలానికి అనుకూలంగా సులభరీతిలో శిక్షణను ఇచ్చి వారికి చదువుపై ఆసక్తి కలిగించే విధానాన్ని అమలుపరచాలని సూచించారు. అలాగే ఇటీవల నిర్వహించిన ఎఫ్ ఎ..1 పరీక్షలలో విద్యార్థులకు వచ్చిన మార్కులను బట్టి వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక చర్చల నివ్వాలని సూచించారు. ఈ శిక్షణా తరగతులలో పాల్గొన్న 52 పాఠశాలల ప్రైమరీ ఉపాధ్యాయులు (50%) తాము బోధించే సబ్జెక్ట్ అయిన ఇంగ్లీషు, తెలుగు, లెక్కలు, పరిసరాల విజ్ఞానం పై చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఆర్పి తాతా సమర్పణ రావు సహకరించారు.

### మొవ్వ హైస్కూల్లో 'ఇంగ్లీషు' సముదాయం

**విశాలాంధ్ర-కూచిపూడి :** మొవ్వ శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం మూడు మండ లాల్లోని హైస్కూల్, యూపీ పాఠశాలల ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ స్థాయి సమావేశం (సముదాయం) నిర్వహించారు. ఈ సమావేశంలో మొవ్వ, పామర్రు, గూడూరు మండ లాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి, మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలల నుంచి ఇంగ్లీషు ఉపాధ్యాయులు 50 మందికిపైగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ గా ఉన్నహై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సబ్బినేని సాంబశివరావు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ఆంగ్ల మాధ్యమం ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్య బోధనలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా కాజ శ్రీ పేకేటి నరసారెడ్డి జిల్లా పరిషత్ హై స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గుర్నాథ బాబు వ్యవహరించగా సి ఆర్ పి చలమలశెట్టి శ్రీమన్నారాయణ సహకరించారు.

### సంప్రదాయ రీతిలో రక్షాబంధన్

**విశాలాంధ్ర-కూచిపూడి :** వెలకట్టలేని బంధాలను, వదులు కోలేని అనుబంధాలను శ్రావణ పూర్ణిమ సందర్భంగా గుర్తుచేసే మధుర బంధమైన రక్షాబంధన వేడుకలను గురువారం సోదర సోదరీమణులు నిర్వహించుకున్నారు, సాంప్రదాయ పద్ధతిలో ఈ వేడుకలు జరుపుకుని సోదరులకు తీపి తినిపించి హారతులను అందించి రాఖీ కట్టి ఆశీస్సులుతోపాటు పుట్టింటి కానుకలు అందుకున్నారు. అదేవిధంగా నూతనంగా ఉపనయన మయిన వటువులకు సమీప దేవాలయాల్లో ఉపాకర్మ కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా యజ్ఞోపవీత ధారణ అర్హులు పూర్ణిమ సందర్భంగా నూతన యజ్ఞోపవీతాలను ధరించారు. ఈ సందర్భంగా గ్రామాలలో పండగ వాతావరణం నెలకొంది.

### అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వండి

**విశాలాంధ్ర-గుడివాడ :** స్థానిక నెహ్రూచౌక్‌లో రాజ్యాంగ్ర నిర్మత బాబా సాహేబ్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు అనుమతిని ఇవ్వాలని కోరతూ ఎస్సీ.బిసిసి మాలల పరిరక్షణ సమైక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర గాబ్రియేలు, జై భీమ్ షెడ్యూల్ క్యాస్ట్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఆర్.కృష్ణారావురావు వేరు వేరుగా మున్సిపల్ కామిషనర్ మురళీకృష్ణకు గురువారం విన్నతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెహ్రూ సెంటర్లో భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు స్థలం కేటాయించి, అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమైఖ సంఘం సభ్యులు గంజి వరప్రసాదరావు, బి,నాగేశ్వరరావు, కోరం రాజు, బి,రాంబాబు,బొడ్డు ప్రకాష్, సొసైటీ ట్రెజరర్ మల్లికార్జునరావు, సభ్యులు బి.గోవర్ధనరావు, డి.ఉపేంద్ర, జి.చంద్రశేఖర్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు

**LAND FOR SALE**

Valuable Lands are available in Remali and Mallavalli Villages, Krishna District.
**Remali** :1.91 Acr.; 1.91 Acr. ; 7.72 Acr.; 7.72 Acr.; 4.71 Acr.; **Mallavalli :** 1.91 Acr.; 1.00 Acr.; 1.00 Acr.; 4.04 Acr.; 8.76 Acr.; 8.76 Acr.; 1.93 Acr.; 7.91 Acr. **Pedavutapalli :** 6.5 Acr
Interested Buyer may Contact: 9848056570
and submit their Quotation to
Email:- excellentproperties77@gmail.com

## దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర ఎంతో కీలకం

**విశాలాంధ్ర-మచిలీపట్నం :** ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే బ్యాంకింగ్ వ్యవస్థ అత్యంత ముఖ్యమని,దేశ ఆర్థిక వ్యవస్థలో బ్యాంకింగ్ పాత్ర ఎంతో కీలకమని కృష్ణాజిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పేర్కొన్నారు. గురువారం స్థానిక కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఆధునికీకరించిన విశ్వవిద్యాలయ శాఖను కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు విశ్వవిద్యాలయ విద్యార్థిని విద్యార్థులు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, భారతదేశ జనాభాలో 60 శాతం మంది 35 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు గలవారని, వారి మేధోశక్తికి తగిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయ క్యాంపస్ లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి స్థాయి బ్యాంకు శాఖగా రూపుదిద్దుకోవడంపై కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. గతంతో సరిపోల్చితే, జిల్లాల పునర్విభజన అనంతరం కృష్ణాజిల్లా గణనీయంగా ఎంతో అభివృద్ధి చెందుతుందని, వందల ఏళ్ల చరిత్ర ఉన్న మచిలీపట్నం పోర్టు పనులను వేల కోట్ల రూపాయలను కేటాయించి ఇటీవల ముఖ్యమంత్రి ప్రారంభించడం ఎంతో విప్లవాత్మకమైన పరిణామమని అన్నారు, అలాగే సెప్టెంబర్ మొదటి వారం నుంచి మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాల ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కావడం ఎంతో శుభ సూచికమన్నారు. కృష్ణా విశ్వ విద్యాలయంలో ఉద్యోగ ఉపాధి ఆధారిత కోర్సులను ప్రారంభించాలని కలెక్టర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కు సూచించారు. మచిలీపట్నం పోర్టు ద్వారా పలువురికి ఉపాధి లభిస్తుందని పోర్ట్ ట్రాన్స్ పోర్ట్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్, ఆక్వా, మెరైన్ ఎక్స్ పోర్ట్ డెవలప్మెంట్ మేనేజ్మెంట్ తదితర కోర్సులను కృష్ణా విశ్వ విద్యాలయంలో ప్రవేశపెడితే మిగతా యూనివర్సిటీల కన్నా భిన్నంగా ఉంటుందని పలువురు విద్యార్థులు ఆయా కోర్సులను అధ్యయనం చేసేందుకు ఆసక్తి చూపుతారని కలెక్టర్ అన్నారు. మచిలీపట్నం నుంచి యూనివర్సిటీకి వచ్చే రహదారులకు మహర్దశ పట్టనుందని, ఆయా రోడ్ల నిర్మాణం ప్రస్తుతం టెండర్ ప్రక్రియ దశలో ఉన్నాయని త్వరలో యూనివర్సిటీకి మెరుగైన రహదారి సౌకర్యం ఏర్పడనున్నట్లు విద్యార్థిని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య కలెక్టర్ పి. రాజాబాబు ప్రకటించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధునికమైన బ్యాంకు సేవలను కృష్ణా విశ్వవిద్యాలయంకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగులతో పాటు పరిసరాల్లోని, ఆక్వా రైతులు, ప్రజలు కూడా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. జ్ఞానమణి, రిజిస్ట్రర్ ప్రొఫెసర్ ఎం.రామిరెడ్డి, రెక్టర్ ప్రొఫెసర్ డి సూర్యచంద్రరావు, మచిలీపట్నం తహసిల్దార్ శ్రీవిద్య, స్టేట్ బ్యాంక్ ఆఫ ఇండియా డీజీఎం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ విజయవాడ మనీష్ కుమార్ సింగ్, రీజనల్ మేనేజర్ ఫణి రామ్ కుమార్, చీఫ్ మేనేజర్ మచిలీపట్నం మెయిన్ బ్రాంచ్ కె.రామారావు, చీఫ్ మేనేజర్ క్రెడిట్,ఎన్ పిఏ టి. ఏసు పాదం, చీఫ్ మేనేజర్ (ఆపరేషన్స్) మురలీధర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధం : దింట్యాల

**విశాలాంధ్ర-గుడివాడ :** జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని గడ్డం గ్యాంగ్‌కు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి పట్టణ, రూరల్, నందివాడ మండల అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళీ, దానేటి సన్యాసిరావులు అన్నారు. గురువారం విశేష ప్రజాధరణతో ముందుకు సాగుతున్న నారా లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతంగా 200 రోజులు 15జిల్లాలు, 77 నియోజవర్గలలో 2709 కిలో మీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రావి అధ్వర్యంలో నాగవరపాడు నుండి ఎన్‌టిఆర్ స్టేడియం వరకు సంఘీభవ పాదయాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహిళా నాయకురాలు సాయిన పుష్పవతితో కలసి వారు మాట్లాడుతూ దగాపడ్డ యువత, మాయమాటలు నమ్మి మోసపోయిన ప్రజలకు నేనున్నా అనే భరోసా ఇచ్చేనందుకు యువతేజం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభంజనంలా సాగుతోందన్నారు. రాష్ట్ర ప్రజలకు నారా లోకేష్ ఉదయించే సూర్యుడిలా కనిపిస్తున్నారన్నారు. రోజురోజుకి నారా లోకేష్ పాదయాత్రకు వస్తున్నా ఆదరణ చూసి వైసీపీ వెన్నులో వణుకు పుడుతోందన్నారు. గుడివాడలో 20 సంవత్సరాలుగా మాయమాటాలతో ప్రజలను మోసం చేసిన కొడాలి నానికి బుద్ధి చేప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి షేక్ ముజాహిద్, సర్పంచ్ కాకర్ల సుభాష్‌చంద్రబోసు(సురేష్),టిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు గోవాడ శివా, మహిళా అధ్యక్షురాలు యార్లగడ్డ సుధారాణి, నాయకులు మజ్జాడ నాగరాజు, ముళ్లపూడి రమేష్, షేక్ సర్కార్, జానీ షరీఫ్, మదాల సునీత, తదితరులు పాల్గొన్నారు.

## గన్నవరం నుంచి పోటీ చేస్తా...
### యార్లగడ్డ వెంకటరావు

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** గన్నవరం నుంచి పోటీ చేస్తానని, తన అనుచరులు వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరినా, చిత్తశుద్ధితో పనిచేసిన టీడీపీ నేతలకే ప్రాధాన్యత ఇస్తామని తెలుగుదేశం పార్టీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జి, కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కేడీసీసీబీ) మాజీ చైర్మన్ యార్లగడ్డ వెంకటరావు స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా పేరుగాంచిందని, అనేక సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన తర్వాత యార్లగడ్డ వెంకటరావు తొలిసారిగా గురువారం గన్నవరం నియోజకవర్గంలోని విజయవాడ రూరల్ మండలం నున్నలో పర్యటించారు. టిడిపి నున్న అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో నున్న ప్రధాన కార్యదర్శి మదు శివరామప్రసాద్, మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన రామారావు, ప్రధాన కార్యదర్శి కోనేరు సందీప్, కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు డి.సుబ్రహ్మణ్యరాజు, జి.బాబురావు, తెలుగు యువత మండల అధ్యక్షులు గంపా శ్రీనివాస్ యాదవ్, పంచాయతీ బోర్డు సభ్యుడు వల్లూరి వెంకట శివ, నాయకులు యార్కారెడ్డి కోటిరెడ్డి, రావిచర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## తీవ్రస్థాయిలో భూ దోపిడి

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) :** రాష్ట్రంలో తీవ్రస్థాయిలో భూ దోపిడి జరుగుతుందని రాష్ట్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు రామాజీ ఇమ్మానుయేలు అరోపించారు.గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ స్వంత జిల్లాలో భూ దోపిడీ జరుగుతుందన్నారు.అనేక ఉద్యమాలు, ర్యాలీలు, దీక్షలు చేసి అవినీతి అధికారులుపై చర్యలు తీసుకొవాలని ప్రభుత్వానికి పిర్యాదు చేసినా స్పదించలేదన్నారు.కడప శివారు ప్రాంతాలైన పెండ్లి మర్రి మండలంలో నాగసాని పల్లె సర్వే నెంబరు 11లో వేల ఎకరాలు, మైదుకూరు మండలంలో, వరదాయపల్లె, అసైన్డ్ భూములు జమ్మలమడుగు నియోజకవర్గంలో, మైలవరం మండలం ముదునూరు మండలం, గండికోట చెన్నూరు మండలం, ఇలా ప్రతి మండలంలో వేల ఎకరాలు కబ్జా చేసి అక్రమంగా వెంచర్లు వేయటమే కాకుండా ఆన్ లైన్ కూడా చేస్తున్నారని వీరికి కొంతమంది రెవిన్యూ రిజిస్ట్రేషన్ అధికారులు సహకరిస్తున్నారని వాటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కడపలోని రిమ్స్ హాస్పిటల్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి కట్టించారని పేదలకు బడుగు బలహీన వర్గాలకు వైద్యం అందించాలని ఉద్దేశంతో కట్టించారని అయితే ప్రస్తుతం అక్కడ అవినీతిమయం అయిందని, పేషెంట్లను సరిగ్గా చూడడం లేదని అన్నారు. సబ్ రిజిస్టర్, ఎమ్మార్వోలపై ఏసిబి దాడులు చేస్తే రాష్ట్రానికి రెండు సంవత్సరాలు సరిపడే బడ్జెట్ వస్తుందన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాని లేకుంటే సీఎం ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపాక వినోద్ కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.చిన్న ఓబన్న, గున్నంపాటి వెంకటరమణ,ఎస్ మురళి ప్రసాద్,వేదవతి,పి సాగర్,ఎస్ అరుణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సుబ్బారాయుడి సేవలో తెలంగాణ మంత్రి తలసాని

**విశాలాంధ్ర-మోపిదేవి :** స్వయంభూవుగా కొలువ తీరిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని తెలంగాణ రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవస్థానానికి వచ్చిన మంత్రి తలసానిని ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో గల నాగ పుట్టలో పాలు పోసి కుటుంబ సమేతంగా మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకొనుగా, ఆలయ పండితులు వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్ ని ఆలయ మర్యాదలతో సత్కరించిన ఆలయ సహాయ కమిషనర్ చక్రధరరావు స్వామి వారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

### కొనసాగిన ఆందోళన

**విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్:** విస్సన్నపేటలో దస్తావేజు లేఖరుల ఆందోళన గురువారం కొనసాగింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా రెండవరోజు కూడా దస్తావేజులేఖర్లు పెన్‌డౌన్ ఆందోళనను కొనసాగించారు. తమ సమస్య ప్రభుత్వం దృష్టికి వెళ్లేంతవరకు ఆందోళనా కార్యక్రమాలు కొనసాగుతాయని ఈ సందర్భంగా వారు తెలిపారు.

## ఏరీస్ ఆగ్రో లిమిటెడ్‌లో అవగాహన

**విశాలాంధ్ర-విజయవాడ:** ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ ఫ్యాక్టరీలో వీవా స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురువారు సూరంపల్లిలోని ఫ్యాక్టరీని స్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఏరీస్ సౌత్ రీజియన్ ప్రతినిధి జయప్రదీప్ సుబ్రమణియన్ మాట్లాడుతూ ఏరీస్ 'ఎనర్జీంగ్ ఎర్త్' భూమిని సారవంతం చేయడం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందడం వలన మానవుల ఆరోగ్య పరిస్థితులు ఏలా ఉపయోగపడతాయో విద్యార్థులకు వివరించారు. ప్రతినిధులు గౌస్, నాగ శ్రీనివాస్‌లు ఉత్పత్తి తయారీ, క్వాలిటీ చెక్ వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శ్రీ వెంకటేశ్వరరావు, రామారావు ఆశోక్‌బాబులు విత్తన దశ నుంచి కోత దశ వరకు పంటకు అవసరమయ్యే పోషకాల లభ్యత నేలలో ఏవిధంగా ఉన్నాయో తెలుసుకునే భూసారా పరీక్షలు గురించి విద్యార్థులకు చెప్పారు. నూతన ఆవిష్కరణ భూ పరీక్షక్ డిజిటల్ పరిశోధన పరికరం గురించి వివరించారు. డ్రోన్ అగ్రీబోట్ వ్యవసాయంలో ఏవిధంగా రైతుకు ఉపయోగపడుతోందో ఏరీస్ సిబ్బంది రాకేష్, నరేష్‌లు విద్యార్థులకు వివరించారు.

## 'సమాజ్ వాది'ని రాష్ట్రంలో బలోపేతం చేస్తాం

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) :** సోషలిస్ట్ బావజాలంతో కులాల మతాలకు అతీతంగా అన్ని మతాల ఒకటేనని చెప్పిన సమాజ్ వాది పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేయటమే లక్ష్యంగా పని చేస్తామని పాశం వెంకటేశ్వర్లు తెలిపారు.గురువారం గాంధీనగర్‌లోని ఒక హోటల్‌లో సమాజ్ వాది పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులుగా పాశం వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బిసి కుల జనగణన చేపట్టాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదన్నారు.రాజధాని నిర్మాణాన్ని ఆపేశారన్నారు.రాష్ట్ర విభజన హామీలను కేంద్రం నుంచి రాబట్టడంలో వైకాపా ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు.నిరుద్యోగులకు జాబ్ క్యాలెండరు ఇస్తామని మోసం చేశారన్నారు.రాష్ట్రాన్ని గంజాయి రాష్ట్రంగా మార్చేశారని మండిపడ్డారు. ఉద్యోగులను ,మీడియా సంస్థలను ఇబందులకు గురి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్నా అన్యాయాలపై ప్రతి ప్రాంతానికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామన్నారు. సామాజిక న్యాయం కోసం సమాజ్ వాదీ పార్టీ కృషి చేస్తుందన్నారు.రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ ,25 పార్లమెంట్ సీట్లలో ఎస్పీ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు జగదీష్ యాదవ్. బిసి సంక్షేమ సంగం యువజన అధ్యక్షుడు కుమ్మరి క్రాంతి కుమార్ దళిత బహుజన ఫ్రంట్ నాయకులు సుబ్బారావు,న్యాయవాది భాస్కరరావు,మైనార్టీ మహిళా షేక్ ఫరీదా,తదితరులు పాల్గొన్నారు.

## రిలయన్స్ ట్రెండ్స్‌ను ప్రారంభించిన యలవర్తి

**విశాలాంధ్ర-గుడివాడ :** గుడివాడలో నూతనంగా ఏర్పాటు చేసిన రిలయన్స్ ట్రెండ్స్‌ను గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ ఆంధ్ర ఒరిస్సా రెండు రాష్ట్రాలలో కలిపి మొత్తం 64 షోరూమ్‌లో ఉండగా 65వ షోరూం గుడివాడ పట్టణంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్వాఫీడ్స్ కోగంటి ఆంజనేయులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు వసంతవాడ పెద్ద దుర్గారావు, శొంఠి రామకృష్ణ, నాయకులు యలవర్తి రాము, మూడేడ్ల రామారావు, అల్లాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## ఫాస్ట్రాక్ బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** భారతదేశపు ప్రతిష్ఠాత్మకమైన వాచ్, యాక్సెసరీస్ బ్రాండ్ ఫాస్ట్రాక్ తమ కొత్త బ్రాండ్ ప్రచారం 'బీ బోత్'తో మళ్లీ యువత నాడిని పట్టుకుంది. విరుద్ధమైన ఆలోచనలు, నమ్మకాలు, వైఖరులను కలిగిన యువత యొక్క అప్రయత్నపు నిర్ణయాలను ఈ ప్రచారం వేడుకగా జరుపుకుంటుంది. బీ బోత్ ద్వారా, ఫాస్ట్రాక్ ఈ కొత్త యుగాన్ని యువత యొక్క అన్ని వ్యక్తీకరణలను మరీ ప్రత్యేకంగా ఫ్యాషన్ లతో స్వాగతించింది. ఈ ప్రచారంలో దేశమంతా ఇష్టపడే యువ సూపర్ స్టార్ విజయ్ దేవరకొండ ఇప్పుడు ఫాస్ట్రాక్ బ్రాండ్ అంబాసిడర్ గా కనిపించనున్నారు.

### విజయవాడ నగరంలో తనిష్క్ షోరూమ్ ప్రారంభం

**విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట :** టాటాకు చెందిన, దేశంలో అతిపెద్ద ఆభరణాల వాణిజ్య బ్రాండ్ తనిష్క్ ఆంధ్రప్రదేశ్లో అతిపెద్ద స్టోరును విజయవాడ ఎమ్.జి.రోడ్, సుదర్శనాంప్లెక్స్ వద్ద ప్రారంభించారు. ఈ స్టోరును టైటాన్ కంపెనీ లిమిటెడ్, తనిష్క్ మేనేజింగ్ డైరెక్టర్ సి.కె. వెంకటరామన్, టైటాన్ కంపెనీ లిమిటెడ్, తనిష్క్ రీజనల్ బిజినెస్ హెడ్ సౌత్ శరద్ ఆర్ ప్రారంభించారు. తనిష్క్, మేనేజింగ్ డైరెక్టర్ సి.కె. వెంకటరామన్ మాట్లాడుతూ విజయవాడలో ఆంధ్రప్రదేశ్లోనే అతిపెద్ద స్టోర్ను ప్రారంభించడం సంతోషంగా ఉన్నామన్నారు. దేశంలో ఎక్కువమంది అభిమానించే జ్యుయలరీ బ్రాండ్గా, మా వినియోగదారులకు అత్యద్భుతమైన కస్టమర్ సేవలను అందించాలన్నది మా ప్రయత్నం. మేము స్థిరంగా వినూత్నమైన జ్యూయలరీ షాపింగ్ అనుభవాలను ప్రపంచ శ్రేణి రిటైల్ వాతావరణంతో అందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

## అప్పిగట్ల జోసఫ్ దళితుల ఆశాజ్యోతి

**విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) :** అప్పిగట్ల జోసఫ్ దళితుల ఆశాజ్యోతి, పేదలపాలిట పెన్నిదని పలువురు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ మాదిగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్వర్యంలో అప్పిగట్ల జోసఫ్ 28వ వర్ధంతి సభ గురువారం గాంధీగన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించారు. ముందుగా జోసఫ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపి మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాట్లాడుతూ దళిత జాతిలో మొదటి పార్లమెంట్ సభ్యులుగా, శాసనమండలి సభ్యులుగా,ఫ్రీడమ్‌ఫైటర్‌గా ప్రజలకు ఎన్నోసేవా కార్యక్రమాలు చేసిన ఘటన అయనకే దుక్కుతుందన్నారు. దళితు సంక్షేమానికి వారి అభివృద్ధికి నిరంతరం పాదుపడిన మహనీయదుని కొనియాడరు. ఈ కార్యక్రమంలో అప్పిగట్ల జోసఫ్ కుమారుడు వల్లభాయిపటేల్, మాజీ నగర డిప్యూటి మేయర్ ఫ్రాన్సిస్ గ్రిటన్, ఏపి ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ,పోతరాజు ఏసుదాసు,అప్పిగట్ల జీవరత్నం,బుదాల శ్రీను,పెటేటి రాజమోహన్,పల్లె ప్రభు,అనపర్తి గుప్తా,తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధార్థలో ఓనం వేడుకలు

**విశాలాంధ్ర-విజయవాడ:** ఘనంగా ఓణం పండుగ వేడుకలను గురువారం వీరమాచనేని పెద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ పాఠశాలలో నిర్వహించారు. దక్షిణభారతదేశ రాష్ట్రమైన కేరళలో అతిపెద్ద పండుగగా, మలయాళీ కాలగణనంలో మొదటి నెల అయిన చింగంలో (ఆగస్టు-సెప్టెంబర్) వస్తుందని, మహాబలి ఆ ప్రాంతమునకు తిరిగి రావటాన్ని సూచిస్తుందని పాఠశాల సంచాలకులు మేడా సీతారామయ్య, ఉప సంచాలకులు మేరీ, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ జయలక్ష్మీ తెలిపారు. శ్రవణా నక్షత్రమును మలయాళమున "తిరువోణము" అంటారని, సింహ మాసంలో వచ్చే శ్రవణా నక్షత్రయుక్త దినమును ఓణం లేక తిరువోణం పేరిట జరుపుకుంటారని తెలియజేశారు. ఈ పండుగ పది రోజుల పాటు కొనసాగుతుందని, ఇది కేరళ ఆచారములు, సంప్రదాయములు వంటి అనేక అంశములతో ముడిపడి ఉందన్నారు. ప్రజలు వారి ఇంటి ముంగిట్లో రంగురంగుల పువ్వులతో రంగవల్లులు అలంకరణ జరుగుతోందని, దీనిని పూక్కలం అంటారని చెప్పారు. పూల ఆకృతులను వృత్తాకారంలో ఉంటాయి. ఈ ఆకృతిలో భాగంగా సాధారణంగా ఒక దీపం ఉంచుతారని, . వల్లంకలి (సర్పాకార పడవ పందెము) ఓణం సమయంలో జరిగే ముఖ్యమైన కార్యక్రమం అన్నారు. అనంతరం విద్యార్థులు కేరళ వేషధారణలో నృత్యాన్ని ప్రదర్శించారు.

## మాధుర్యాన్ని పంచిన చిత్ర గీతాలాపన

**విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ :** తెలుగు కళావాహిని,జి ఆర్ కె,పోలవరపు సాంస్కృతిక సమితి,శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలకు మాధుర్యాన్ని పంచింది. గాయనీ గాయకులుగా పావని,షభన,కె ఎస్ డి నాగమణి,శ్యాంప్రసాద్, చంద్రశేఖర్,డేవిడ్ రాజు,నాగభూషణం తదితరులు మనసే జతగా పాడిందిలే, నీవని నేనని తెలిసెనులే,తెల్ల చీరకు తకదిమి, ఝుమ్మనే తుమ్మెద,ఈ మూగ చూపేలా, దొరకునా ఇటువంటి సేవ,విన్నానులే ప్రియా వంటి ఇత్యాది పాటలను హృద్యంగా,భావ రసభరితంగా పాడి వినిపించారు. శృతిలయ సమ్మిళితమైన ప్రకృతిలో పాటకు మాటకు అవి అవసరమని చాటుతూ వారి అనుభవాన్ని జోడించి చక్కగా పాడి అభినందనలందుకున్నారు. పర్యవేక్షణ తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు చేశారు. అదే వేదికపై లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ అంజలి,ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మదర్ ఆఫ్ యూనివర్స్ మదర్ థెరిస్సా జయంతి వేడుకలను ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు రంగాలలో విశేష కృషి చేసిన పలువురికి ఆ సంస్థలు పురస్కారాలు ప్రదానం చేశాయి.

# కార్మిక నేత భూపతి గురుమూర్తి మృతి కార్మిక లోకానికి తీవ్ర నష్టం

**విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్):** కార్మిక నేత భూపతి గురుమూర్తి మృతి కార్మిక లోకానికి తీరని నష్టం అని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు శ్రద్ధాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నగర కార్యదర్శి కామ్రేడ్ భూపతి గురుమూర్తి(76) గురువారం ఉదయం మృతి చెందారు. మరణవార్త తెలియగానే జి.కోటేశ్వరరావు వించిపేటలోని రామాలయం వీధిలోని తన ఇంటి వద్ద ఉంచిన మృతదేహంపై పార్టీ జెండాను కప్పి, పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గురుమూర్తి నాటి పార్టీ నాయకులు ఎల్.వి రత్నం, తుపాకుల సింహాచలం బోరాడ సీతారామయ్య స్ఫూర్తితో చిన్ననాటి నుండి పార్టీ వైపు ఆకర్షితులై నాటి నుండి నేటి వరకు పార్టీ పట్ల అంకితభావంతో పని చేశారు. ముఖ్యంగా వృత్తి రీత్యా గవర్నమెంట్ హాస్పటల్ ఉద్యోగి అయిన గురుమూర్తి ఏఐటీయూసీలో చేరి అంచెలంచెలుగా మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నగర కార్యదర్శిగా, రాష్ట్ర నాయకులుగా మెడికల్ ఎంప్లాయిస్, నర్సులు, పార్ట్ టైం మెడికల్ ఎంప్లాయిస్ హక్కులకై నిరంతరం కృషి చేసేవారు, ఎల్లవేళలా యూనియన్ ఆఫీసులో ఉంటూ ఉద్యోగులస్తులకు అందుబాటులో ఉండేవారు, యూనియన్ కార్యాలయం నేటి పాత గవర్నమెంట్ హాస్పటల్ ఉండేది. గవర్నమెంట్ హాస్పటల్లో చికిత్స కై చేరిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు, మెరుగైన చికిత్స అందే విధంగా సహాయపడే వారు, వీరి కుటుంబం మొత్తం పార్టీకి అంకితమై పనిచేసే వారు. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో సీపీఐ నగర కార్యదర్శి వర్గ సభ్యులు తాడి పైడయ్య, కార్యవర్గ సభ్యులు కొట్టురమణారావు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, స్థానిక పార్టీ నాయకులు పగిడిగతల రాము, టి వెంకటేశ్వరరావు, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పూతోట ప్రకాష్, మోహన్, మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, భూపతి గోవిందు, తుపాకుల ప్రతాప్, సీపీఐఎంఎల్ నాయకులు వడ్డాది లక్ష్మణరావు, మీసాల కొండలరావు, రెల్లి సంక్షేమ సంఘం నాయకులు మీసాల సాంబశివరావు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రామాలయం వీధిలోని తన ఇంటివద్ద నుండి అంతిమయాత్ర బయలుదేరుతుంది.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా

**విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) :** ఓటరు జాబితలో తొలగించిన నమోదు అయిన ఓటర్లతో పాటు మార్పు చేర్పులను నిశితంగా పరిశీలించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. స్పెషల్ సమరి రీవిజన్-2024లో భాగంగా ఓటరు జాబితలో తొలగింపు నమోదు మార్పు చేర్పుల పరిశీలనలో భాగంగా గురువారం కలెక్టర్ తొలుత స్థానిక సెంట్రల్ నియోజకవర్గంలోని మాచవరం 185, 186 పోలీంగ్ స్టేషన్ పరిధిలో గృహాలను, అనంతరం పశ్చిమ నియోజకవర్గం భవానిపురంలో పలు పోలీంగ్ స్టేషన్ పరిధిలో ఓటర్ల జాబితాతో వారి ఇంటి వద్దె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా ప్రకారం 16 లక్షల 670 మంది ఓటర్లు నమోదయ్యారన్నారు. నమోదైన ఓటర్ల జాబితాను జూలై 21 నుండి ఆగస్టు 21వ తేది వరకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణజీ× బూత్ లెవల్ అధికారులు, ఏజెంట్లు ఇంటింటికి వెళ్ళి పరిశీలించినట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో గతేడాది జనవరి నుండి ఈ ఏడాది ఆగస్టు వరకు పరిశీలనలో లక్ష 60 వేలకుపైగా మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, ఒకే ఓటు పునరావృతం కావడం గుర్తించినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఎన్నికల రిటెనింగ్ అధికారి కనీసం 1000, స్పెషల్ ఆఫీసర్ 500, కలెక్టర్ హోదాలో జిల్లా ఎన్నికల అధికారి 100 ఓట్లను క్షేత్రస్థాయిలో పర్యటించి ర్యాండమ్‌చెక్ చేయాలని ఎన్నికల సంఘం సూచించిందన్నారు. సెప్టెంబర్ 7వ తేదిలోపు ఈ ప్రక్రియను పూర్తి చేసి 8వ తేదిన ఎన్నికల సంఘానికి నివేధిక అందిస్తామన్నారు. ఓటరు మార్పుపై ఓటర్ గతంలో తాను నివాసం ఉన్న ప్రాంతంలోనే ఓటు ఉండాలని ఆశిస్తు జాబితాలో సవరణ చేసుకోవడం లేదన్నారు. ప్రస్తుతం నివాసం ఉంటున్న డోర్ నెంబర్‌లోనే తప్పక ఓటర్‌గా నమోదు చేసుకోవాలని, లేకపోతే జాబిత నుండి తొలగించబడుతుందనే విషయాన్ని సంబంధిత ఓటర్లకు బూత్ లెవల్ అధికారులు వివరించాలని ఆదేశించామన్నారు. బూత్ లెవల్ అధికారి జాబితా పరిశీలించిన సమయంలో ఓటర్లు సరైన సహకారం అందించాలని, లేని పక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉదయబాస్కర్‌రావు, సహాయ రిటర్నింగ్ అధికారి వెంకటలక్ష్మి, ఎన్నికల డిప్యూటీ తహాశీల్దార్ అబ్దుల్ దరియా, సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్, బీఎల్‌వోలు వనిత, రాజశేఖర్‌బాబు, సెంట్రల్ నియోజకవర్గ ఎన్నికల డిప్యూటి తహాశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

**ఓటర్ల జాబితా సమావేశంలో కొట్టు రమణారావు**

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం మున్సిపల్ కార్పొరేషన్ హాల్‌లో ఓటర్ల జాబితా అన్ని పార్టీలతో గురువారం సమావేశం జరిగింది. జరిగిన సమావేశంలో సీపీఐ తరుపున నగర కార్యవర్గ సభ్యులు కొట్టు రమణారావు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

# నిరంతరం ప్రజల పక్షాన సీపీఐ పోరాటం

**భూపేష్ గుప్తభవన్ ప్రారంభంలో సీపీఐ సీనియర్ నేత వలంకొండ**

**విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు :** పేదల పక్షాన నిరంతరం పోరాడుతూ ప్రజలకు ఎల్లవేళలా అండగా భారత కమ్యూనిస్ట్ పార్టీ పనిచేస్తుందని సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గం సీనియర్ నాయకులు వల్లంకొండ బ్రహ్మం తెలిపారు. పెనుగంచిప్రోలు మండలంలోని అనిగండ్లపాడు గ్రామంలో గురువారం సీపీఐ సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన భూపేష్ గుప్తా భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. నియోజకవర్గం పరిధిలో పెదవర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తుందని తెలిపారు. కార్మిక కర్షక బడుగు బలహీనవర్గాల సంక్షేమం, వ్యవసాయ కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తూ వారికి భారత కమ్యూనిస్ట్ పార్టీ వెన్నుదన్నుగా నిలుస్తుందని అన్నారు. ముందుగా పార్టీ కార్యాలయం ముందు అమరవీరుల స్థూపంపై సీపీఐ నాయకులు మాజీ ఎంపీపీ పొన్నం నరసింహారావు అరుణ పాతకాని ఎగురవేసి అమర వీరులకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ సీనియర్ నాయకులు పాటిబండ్ల లక్ష్మయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నందిగామ నియోజకవర్గ కార్యదర్శి చుండూరు సుబ్బారావు, జగ్గయ్యపేట నియోజకవర్గ సహాయ కార్యదర్శి అంబోజి శివాజి, అనిగండ్లపాడు కార్యదర్శి గడ్డం శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, చాగంటి రామకృష్ణ, వల్లం కొండ భాస్కరరావు, చిన్న భాస్కరరావు, పత్తిపాటి రంగారావు, కాటారపు కన్నయ్య, జక్కులూరి వెంకటేశ్వర్లు, గుజర్లపూడి స్వామి, యాదగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ సానుభూతిపరుడు తోట బుల్లబ్బాయి మృతి

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** సీపీఐ సానుభూతి పరుడు తోట బుల్లబ్బాయి(62) అలియాస్ చంటి గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో కన్నుమూశారు. ఆనాడు పార్టీ సభ్యుడిగా 1992 సంవత్సరంలో చంద్రరాజేశ్వరరావునగర్ ఏర్పాటు కోసం కృషి చేశారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, బర్రె శ్రీనివాసరావు, వంకాయలపాటి నారాయణరావు వారి సారథ్యంలో శేఖర్‌బాబు కార్యదర్శిగా ఉన్నప్పుడు చంద్రరాజేశ్వ రరావు నగర్‌లో పార్టీ నిర్మాణం, ఆనాడు జల్లివిల్సన్ కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో ఆ ప్రాంతం అభివృద్ధిలో బుల్లబ్బాయి కృషి చేశారు. ఆయన బామర్ది పూసర్ల లక్ష్మణరావు 7వ డివిజన్ కార్యదర్శిగా, మరో బామర్ది పీ.శ్రీను డివిజన్ కమిటీ సభ్యులుగా పార్టీలో పని చేస్తున్నారు. బుల్లబ్బాయికు ముగ్గురు కుమారులు, భార్య, ఇద్దరు కొడలు ఉన్నారు. ముగ్గురు కుమారులు, భార్య ఆ డివిజన్‌లో పార్టీకి కోసం కృషి చేస్తున్నారు. బుల్లబ్బాయి కుటుంబ సీపీఐ కార్యక్రమాల్లో చురుగా వ్యవహరించారు.

**బుల్లబ్బాయికు నివాళులు :**

బుల్లబ్బాయి గుండెపోటుతో మరణ వార్త తెలియగానే సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, 7వ డివిజన్ ఇన్‌ఛార్జ్ అప్పురబోతు రాము, డివిజన్ కార్యదర్శి పూసర్ల లక్ష్మణరావు, కమిటీ సభ్యులు పీ.శ్రీనివాసరావు, బీ. మాణిక్యం, కొల్లు రమణ, ఆడిగర్ల దేవి, 6వ డివిజన్ సహాయ కార్యదర్శి పందిరి నూకరాజు, ఏఐవైఎఫ్ 6వ డివిజన్ అధ్యక్షుడు దిబ్బిడి శివ, సాధిరెడ్డి శ్రీనివాసరావు, రంగు రమేష్, మెట్ల శివ, ఎం.రాఘురామారావు, సామల సత్యవతి, తోట లక్ష్మీ, పార్టీ సభ్యులు, కార్యకర్తలు బుల్లబ్బాయి మృతదేహానికి నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు మొగల్‌రాజ్‌పురం చంద్రరాజేశ్వరరావునగర్ నుండి స్వర్గపురికి అంతిమయాత్ర బయలుదేరుతుంది.

## ప్రజా గాయకుడు ఇమామ్ బాషాకు నివాళులు

**విశాలాంధ్ర-విజయవాడ:** భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజానాట్యమండలిలో గత కొన్ని ఏళ్లుగా తన మధురమైన కంఠంతో పాటలు పాడుతూ డప్పు వాయిస్తూ ప్రజా గాయకుడు ఇమామ్ బాషా అనారోగ్య కారణంతో తుది శ్వాస విడిచారు. గురువారం ఆయన పార్థీవదేహాన్నీ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి చిలుకూరు వెంకటేశ్వరరావు, తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్‌కే.నాగుల్ మీరా పట్టణ కార్యదర్శి మాలపాటి ఉదయ్‌లు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇమామ్ భాష భారత కమ్యూనిస్టు పార్టీలో ఎంతోమంది మనలను పొందిన భాష అనారోగ్య కారణం వలన ఉదయం తెల్లవారుజామున కన్నుమూశారని తెలిపారు. వారి కుటుంబానికి భారత కమ్యూనిస్టు పార్టీ తరఫున ప్రగాఢమైన సానుభూతి తెలిపారు.

# అక్రమ లేఔట్‌లపై చర్యలు తీసుకోండి

**తహాశీల్దార్‌కు 5వ వార్డు కౌన్సిలర్ మనోహర్ వినతి**

**విశాలాంధ్ర-జగ్గయ్యపేట :** పట్టణ రెవెన్యూ పరిధి, మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్ నెంబర్ 102, 103, 104, 105, 106 సర్వే నెంబర్లలో సుమారు ఐదు ఎకరాల వ్యవసాయ భూమిని గ్రావెల్‌తొలి అనుమతులు లేకుండా ల్యాండ్ కన్వర్షన్ ఫీజులు చెల్లించకుండా ప్లాట్లు వేస్తున్నట్లు ఐదవ వార్డు కౌన్సిలర్ వట్టెం మనోహర్ తెలిపారు. సంబంధిత విషయంపై సర్వే నెంబర్లు పట్టాదారులు ఎవరో గమనించి వారి నుండి ప్రభుత్వానికి రావలసిన పదిశాతం భూమిని అనగా సుమారు రెండు కోట్ల 50 లక్షల విలువగల ప్రభుత్వానికి రావాల్సిన భూమిని ప్రభుత్వానికి అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సదరు విషయంపై తహాశీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు కౌన్సిలర్ మనోహర్ తెలిపారు.

**యువగళంకు సంఘీభావంగా పాదయాత్ర**

**విశాలాంధ్ర-వీరులపాడు:** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువతరం పేరుతో చేస్తున్న పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా మాజీ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య అధ్యక్షతన యువగళం పాదయాత్రకు సంఘీభావంగా అల్లూరు గ్రామం నుండి జుజ్జూరు గ్రామం వరకు పాదయాత్ర నిర్వహించారు.గురువారం సాయంత్రం 06:30 గంటలకు అల్లూరు గ్రామం లో బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అక్కడనుండి జుజ్జూరు గ్రామం వరకు మండల తెదేపా శ్రేణులతో కలిసి పాదయాత్ర చేశారు. అనంతరం జుజ్జూరు గ్రామంలో సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట :** శ్రీ శ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు వారి దివ్య ఆశీస్సులు తో కృష్ణ జన్మాష్టమి పోస్టర్ లను ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకృష్ణుడు మానవాళికి జ్ఞానం అందించటం కోసం అవతరించిన భగవంతుడు అని తెలిపారు. ఆయన తెలిపిన భగవద్గీత గ్రంథం సర్వ మానవాళికి గొప్ప మార్గదర్శకము అని పేర్కొన్నారు. అటువంటి భగవానుడు అయినా శ్రీ కృష్ణుడి జన్మదినం ను కృష్ణాష్టమిగా వేడుకలు నిర్వహించటం గొప్ప కార్యం అని అన్నారు.అందరూ వేడుకలకు విచ్చేసి దేవదేవుని ఆశీర్వాదాలు పొందాలనీ కోరారు. ఈ వేడుకలు ఈనెల 6 వ తేదీ నుండి 13 వరకు ఉంటుందని 13వ తేదీ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందనీ వివరించారు.కార్యక్రమంలో గ్రంధాలయ అధికారిణి కే.రమాదేవి, సిబ్బంది వై .ధనలక్ష్మి, కె.రాంబాబు, కే.సుబ్బయ్య త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయవాడ కమిటీ, అధ్యక్షుడు, సభ్యులు సురేష్, తిరుపతి, సత్యం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్ ని విడుదల చేసిన ఇసుజు మోటార్స్

**విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్):** తమ పూర్తి సరికొత్త డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్ వేరియంట్ ను ఇసుజు మోటార్స్ ఇండియా విడుదల చేసింది. వాణిజ్య విభాగంలో స్మార్టెస్ట్ గా కనిపించే క్రూ-క్యాబ్ పికప్ తో సిద్ధమైన సాధారణతకు మించిన వాహనం ఇది. స్మార్ట్ లుక్స్ తో కఠినమైన వర్క్ హెూర్స్ సామర్థ్యం, భద్రత, ప్రయాణికుల వాహన తరహా సౌకర్యాల కలయికతో దీన్ని ప్రత్యేకతగా తీర్చిదిద్దారు. టాప్ ఎండ్ వేరియంట్ జోడింపుతో పాటు, అన్ని వ్యాపారపరమైన, వృత్తిపరమైన అవసరాల కోసం ఇసుజు ఇండియా మరింత సమగ్రమైన, వైవిధ్యమైన శ్రేణిని అందిస్తోంది.


**ప్రకటన**

[illegible] 4వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు వారు న్యాయస్థానం విజయవాడ వారి PRCNo: 15/2016, CR. No: 359/11, U/S 498(A) & 302 IPC of పటమట P.S విజయవాడ సిటీ కేసులో ముద్దాయి అయిన రామిశెట్టి రామయ్య, [illegible] Hon'ble 4th ACMM Court [illegible] ACMM Court [illegible] రామిశెట్టి రామయ్య, [illegible]

INSPECTOR OF POLICE
PATAMATA P.S. VIJAYAWADA CITY.
స్టేషన్ నెంబర్ 9515852446
సి.ఐ గారి నెంబర్ 9440627086


# విజయవాడలో డ్రగ్స్ కలకలం

**- 3.42 గ్రాముల ఏండీఏంఏ డ్రగ్స్ స్వాధీనం**

**విశాలాంధ్ర-విజయవాడ (క్రైం):** విజయవాడలో డ్రగ్స్ కలకం రేపింది. నిషేధిత డ్రగ్స్ (ఏండీఏంఏ సింథటిక్స్ డ్రగ్స్) బెంగుళూరు నుంచి రాజమండ్రికి డ్రగ్స్ తీసుకెళ్తున్న ఓ యువకుడిని విజయవాడ పోలీసులు పట్టుకున్నారు. రాజమండ్రికి చెందిన అభిషేక్ వర్మ నుంచి 3.42 గ్రాముల ఏండీఏంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ బస్టాండ్‌లో తనిఖీలు చేస్తుండంగా ఈ డ్రగ్స్ పట్టుపడింది. ఈ మేరకు కృష్ణలంక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**విజయవాడలో ఎటువంటి డ్రగ్స్ లేవు : పోలీసులు**

విజయవాడలో డ్రగ్స్ అమ్మకాలు, వినియోగం రవాణా జరుగుతోందని, భారీ ఎత్తున ప్రచారం జరిగిందని పోలీసులు వివరణ ఇచ్చారు. ఈ వ్యవహారంపై పోలీసులు ప్రత్యేకంగా చర్యలు తీసుకున్నట్లు ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసులు సాధారణ తనిఖీలలో భాగంగా ఈనెల 29వతేదీన విజయవాడ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా, రాజవోలు అభ్యుదయ కాలనీకి చెందిన అభిషేక్ వర్మ(22) అనునాస్పదంగా పోలీసులకు చిక్కాడు. అతన్ని విచారించగా అతని వద్ద 3.42గ్రాముల డ్రగ్స్ లభ్యమైంది. వెంటనే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అభిషేక్ వర్మ 2020 సంవత్సరంలో బీటెక్ చదుకోనే సమయంలో గంజాయి తాగే అలవాటు ఉంది. గత ఆరు నెలలుగా అభిషేక్ వర్మ అతని స్నేహితులతో కలిసి గంజాయి సేకరిస్తున్నట్లు విచారణ తేలింది. గంజాయిని రాజమండ్రి చట్టుపక్కల ప్రాంతాల్లో కొనుగోలు చేసి వాటిని వినియోగిస్తున్నారు. గత కొంతకాలంగా తన చిన్ననాటి స్నేహితుడు ఏండీఏంఏ డ్రగ్స్ విక్రయాలు చేస్తున్నట్లు తెలిసి, అతని వద్ద కొనుగోలు చేశాడని పోలీసులు తెలిపారు. ఈడ్రగ్స్‌ను బెంగుళూరు నుండి రాజమండ్రి వెళ్తున్న సమయంలో విజయవాడ బస్టాండ్‌లో పట్టుపడ్డాడని చెప్పారు. కానీ విజయవాడ నగరంలో ఏలాంటి డ్రగ్స్ లేవని తెలిపారు.

# రాఖీ వేళ విషాదం..

**- చెల్లెలి ఇంట్లో అన్న ఆత్మహత్య**

**విశాలాంధ్ర-విజయవాడ (క్రైం):** రాఖీ పండుగవ వేళ విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. చెల్లెలి ఇంట్లో అన్న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామలింగేశ్వరనగర్‌కు చెందిన మల్లిఖార్జునరావు (47)కు భార్య పిల్లలు ఉన్నారు. కొంతకాలం క్రితం భార్య తన పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇటీవల భార్య పిల్లలు లేకపోవడంతో మద్యంకు అలవాటు పడ్డాడు. ఈనెల 30వ తేదీన రాఖీ కట్టించుకునేందుకు ఏపీఐఐసీ కాలనీలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లాడు. ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయం లో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పటమట పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు అనునానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# చైన్ స్నాచింగ్ కలకలం

- మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లేందుకు యత్నం
- కేకలు వేయడంతో దొంగను పట్టుకున్న స్థానికులు

**విశాలాంధ్ర-విజయవాడ (క్రైం):** విజయవాడలో ఓ దొంగ చైన్ స్నాచింగ్‌కు పాల్పడటం కలకలం రేపింది. బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళా మెడలో గొలుసును లాక్కెళ్లేందుకు ప్రయత్నం చేశాడు. మహిళ కేకలు వేయటంతో స్థానికులు చుట్టుముట్టి పట్టుకున్నారు. ఈ ఘటన విజయవాడ సత్యనారాయణపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ప్రకాష్‌నగర్‌కు చెందిన రామ్‌లక్ష్మీ సత్యనారాయణపురం రైల్వే క్వాటర్స్‌లో వివాహ వేడుకకు వెళ్లి తిరిగి వెళ్తున్న సమయంలో చైన్‌స్నాచింగ్‌కు ప్రయత్నం చేశాడు. స్థానికులు వెంటనే స్పందించి దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బెట్ట నివారణకు జాగ్రత్తలు పాటించాలి: డీఏఓ

**విశాలాంధ్ర-వీరులపాడు:** మండలంలో బోడవాడ, తాటిగుమ్మి, జుజ్జూరు, చెన్నారావు పాలెం గ్రామాలలో మొక్కజొన్న, ప్రతి పంటలను జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నాగమణమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో కలిసి గురువారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడుతూ వారికి తగు సూచనలు ఇచ్చారు.తేలికపాటి నేలలో వేసిన మొక్కజొన్న, ప్రతి పంటలలో పెరుగుదల తగ్గి మొక్కజొన్న పైరు ఎండిపోవడం జరుతున్నదని, ప్రత్తి పంటలో ముఖ్యంగా తామర పురుగు, నల్లి, తెల్ల,పచ్చ దోమల ఉధృతి ఎక్కువగా ఉండి మొక్కలను పెలుసుగా మార్చడం జరుగుతున్నదన్నారు. నల్ల రేగడి భూముల్లో మొక్కజొన్న పంటకు పొటాషియం నైట్రేట్ (13-0-45) వారం రోజుల వ్యవధిలో సుమారు మూడు నుంచి నాలుగు సార్లు పిచికారి చేసుకోవడం వలన బెట్ట పరిస్థితులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్తి పంటలో రసం పీల్చు పురుగులు ఉధృతి తగ్గించుకొని యాజమాన్య పద్ధతిలో వేప సంబంధిత ఉత్పత్తులను ఉపయోగించి నివారణ చేయవలసినదిగా తగు సూచనలు సూచించారు. ప్రత్తి పంటలో పసుపు,బులుగు జిగురు అట్టలను ఎకరాకు 10 చొప్పున పంట ఎత్తులో ఏర్పాటు చేయడం ద్వారా రసం పీల్చు పురుగులను అరికట్టవచ్చునని అదేవిధంగా ప్రత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ కొరకు 0.2 శాతం ప్రోఫినోపాస్ లేదా క్లోరిపైరీఫాస్ 0.25 శాతం మరియు ఇమిడ 0.2 శాతం పిచికారి చేసుకోవలసినదిగా సిఫార్సు చేశారు. ప్రత్తి పంటలో లింగాకర్షణ బుట్టలు ఎకరాకు నాలుగు నుండి ఆరు పెట్టి పురుగుల ఉధృతి తెలుసుకొని పై మందులను మార్చి మార్చి పిచికారి చేయవలసినదిగా సిఫార్సు చేసినారు. తేలికపాటి నేలలో నీటిని నిల్వ పెంపొందించుకొనుటకు పంట అవశేషాలను నేలల్లో కుళ్లింపు చేసుకునేవిధంగా అదే నేలలో వేసి కలియ దున్నాలి, దానివలన సేంద్రియ పదార్థం అందించి నీటి నిల్వ ఉంచుకునే గుణాన్ని పెంపొందించుకోవాల్సిందిగా సిఫార్సు చేసినారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రం( గరికపాడు) ప్రధాన శాస్త్రవేర్తలు పి.మధువాణి, ఎస్ .కృష్ణంరాజు నందిగామ ఏ డి ఏ ఐకే .శ్రీనివాసరావు, వీరులపాడు వ్యవసాయ అధికారి బి. జోగేంద్రప్రసాద్, విఏఏ లు రైతులు పాల్గొన్నారు.

## రహదారి అభివృద్ధికి మోక్షం

**విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్:** గత కొన్ని సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వాసుపత్రి రహదారి పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సుమారు గత దశాబ్దకాలంగా ఈ మార్గం అభివృద్ధికి ప్రజలు వేడుకుంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారి అభివృద్ధికి నిధులు మంజూరైనా, పనులు ఆరంభం కాలేదు. గత ఏడాది స్థానిక శాసనసభ్యుడు కె.రక్షణనిధి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ సమస్య ఆయన దృష్టికి రాగా, ఈ కార్యక్రమానికి సంబంధించిన నిధులతో అప్పటికప్పుడు రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నిధుల వెసులుబాటు లేకపోవటంతో గత ఏడాది కాలంగా పనులు ఆరంభం కాకపోవటంతో విమర్శలు వెల్లువెత్తాయి. తాజాగా ప్రభుత్వం రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయటంతో యుద్ధప్రాతిపధికన పనులు పూర్తి చేశారు.

**పర్యావరణ పరిరక్షణ సామాజిక భాధ్యత చేపట్టాలి : కలెక్టర్**

**విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక భాధ్యతగా మొక్కలు పెంచి కాలుష్య నివారణలో ప్రజలను భాగస్వాములను చేయడంలో స్వచ్ఛంద సంస్థలు సహకారం అభినందనీయమని జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ జిల్లా ప్రెసిడెంట్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సామాజిక కార్యక్రమంలో భాగంగా స్థానిక మొగల్రాజపురంలో వీజీఆర్ దయాబెటిస్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మొక్కల పంపిణీ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. వీజీఆర్ దయాబెటిస్ సెంటర్ అధినేత డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఉచితంగా వెయ్యి మొక్కలను ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.సమరం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి డా.ఇళ్ల రవి, వైద్యులు డా.తనూజ పాల్గొన్నారు.

## 'పీఎం ఉపాధి కల్పన'కి విస్తృత ప్రచారం

**విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) :** సూక్ష్మ, చిన్న మధ్య తరహ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లక్స్ నిర్మాణాలను చేపట్టేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం నుండి డీఐఇపీసీ కమిటీ చైర్మన్, కలెక్టర్ గురువారం గూగుల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా అభివృద్ధితో పాటు ఔత్సహిక పారిశ్రమిక వేత్తలను ప్రోత్సహించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ఆన్‌లైన్ సింగల్ డెస్క్ పోర్టల్‌లో అనుమతులను నిర్థేశించిన గడువులోగా మంజూరు చేయాలన్నారు. పీఎం ఉపాధి కల్పన పథకానికి విస్తృత ప్రచారం నిర్వహిస్తే స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చి నిరుద్యోగ్యాన్ని తగ్గించవచ్చున్నారు. ఈ పథకంలో జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను నూరు శాతం సాధించి జల్లాలో పరిశ్రమలను ఏర్పాటుకు 3 నుండి 5 ఎకరాలలోపు భూమిని గుర్తించి ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లక్స్ నిర్మించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా పరిశ్రమల జీఎం సుధాకర్, ఎల్‌డీఎం కే.ప్రియాంక, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సీతారామ్ పాల్గొన్నారు.

**క్షతగాత్రుడికి తాతయ్య ప్రథమచికిత్స**

**విశాలాంధ్ర-నందిగామ రూరల్ :** దారిలో నువ్వు సాయపడవోయ్ అన్న నిజం చేస్తున్న జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య గురువారం మధ్యాహ్నం గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మూర్తి, అజయ్‌లు పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో మొక్కు తీర్చుకొని తిరిగి బైక్ పై ప్రయాణమై వారి స్వగ్రామమైన తెనాలికి వెళ్తుండగా నందిగామ బైపాస్ ఫ్లై ఓవర్ మీద బైక్ అదుపు తప్పి రోడ్డుపై పడిఉన్నాడు. జగ్గయ్యపేట నుండి విజయవాడ వెళ్తున్న తాతయ్య గాయపడిన వ్యక్తికి తమ కారులో ఉన్న ఫస్ట్ ఎయిడ్ కిట్ ద్వారా ఫస్ట్ ఎయిడ్ చేశారు. అనంతరం తమ సొంత వాహనం(కారు)లో ప్రమాద బాధితులను ఎక్కించుకొని నందిగామ ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.